www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 జనవరి 2024
5
చిత్తూరు

అంగన్వాడీల అరెస్టులు దారుణం

అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాసంఘాల నిరసన

అంగన్వాడీల అరెస్టులను ఖండిస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంగన్వాడీల అరెస్టులను నిరశిస్తూ సిపిఎం, సిపిఐ, ఏఐటీయూసీ, సిఐటియు నేతలు సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.చైతన్య, ఏఐటియుసి జిల్లా నాయకులు దాసరి చంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత 43 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ, దీక్షలు చేపడుతున్న వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోగా ఉద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, జీవో నెంబర్ 2ను ఉపయోగించి ఏస్మా చట్టాన్ని ప్రయోగించి కార్యకర్తలను భయభ్రాంతులను చేసి విధుల నుండి తొలగించడానికి పూనుకోవడమే కాకుండా పోలీసులను రెచ్చగొట్టి ఉద్యమాన్ని నిర్మించడానికి అంగన్వాడీ కార్యకర్తలను వేలపాలలేక గహనిర్బంధాలు చేయడం, అక్రమ అరెస్టులను చేయడం దుర్మార్గమని, భారత రాజ్యాంగం రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల పెట్టడం గొప్ప కాదు ఆ మహా పురుషుడు రాసిన రాజ్యాంగాన్ని చట్టాన్ని ఆశయాలను అమలు చేయకుండా తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే 24వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రబంద్ చేపడుతున్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు సిపిఎం జిల్లా నాయకులు కాంచీపురం సురేంద్రన్, సిపిఐ నగరకార్యదర్శి విసి.గోపీనాథ్, ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రమాదేవి నాయకులు లతారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

24న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఒక లక్షా ఐదువేల మంది అంగన్వాడీ మహిళ శ్రామికుల జీతభత్యాలు, పనిభారలు తదితర సమస్యలపై గత 42 రోజులుగా సమ్మె జరుగుతోందని, వారి డిమాండ్లకు మద్దతుగా ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాలను జగనన్నకి సమర్పించడానికి విజయవాడ వస్తున్న అంగన్వాడీలపై పాశవికంగా పోలీసులతో దాడి చేయించారు. దీనిని నిరసిస్తూ కార్మిక సంఘాలు ప్రకటించిన 24 రాష్ట్ర బందుకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని ప్రజలందరూ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి బదులు రాష్ట్రప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అత్యంత నిరంకుశమైనదన్నారు. పైగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న దీక్షా శిబిరంపై సోమవారం 42వ రోజు తెల్లవారు జామున 3 గంటలకు నిరాహారదీక్ష శిబిరాన్ని కూల్చారని, దీక్షలు చేస్తున్న నాయకులను దూరప్రాంతాలకు తరలించి నిర్బంధించారని, వారి ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోలేదని అన్నారు. కరెంటు తీసివేసి ఆడవాళ్ళను కూడా మగ పోలీసులే అరెస్టులు నిర్వహించి అరగంట పాటు యుద్ధభూమిని తలపించారన్నారు. దీక్షలకు మద్దతుగా పాల్గొన్న సుమారు 2వేల మంది అరెస్టు చేసి మచిలీపట్నం, నూజివీడు తదితర సుదూర ప్రాంతాలకు తరలించారని,లక్ష మందికి పైగా అంగన్వాడీలు చాలీచాలని జీతాలతో జీవిస్తున్న మహిళా కార్మికులపట్ల రాష్ట్ర ప్రభుత్వ పాశవిక విధానానికి వ్యతిరేకంగా, బాధిత అంగన్వాడిలకు సంఘీభావంగా రాష్ట్ర బంద్ చేయడం అవసరమని రాష్ట్ర అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు భావించాయని తెలిపారు. రాష్ట్ర బంద్ జయప్రదం చేయడం ద్వారా నిరంకుశ రాష్ట్ర ప్రభుత్వం పట్ల తగిన ప్రతిఘటనను ప్రదర్శించాల్సి ఉందని మేము భావిస్తున్నామని తెలిపారు. ఈ పిలుపును సిపిఎం ప్రత్యక్షంగా మద్దతిస్తూ వివిధ వర్గాల ప్రజలు అంగన్వాడీల న్యాయమైన పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

24న బంద్‌కు వ్యకాసం పిలుపు

42 రోజుల నుండి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీలపై అత్యంత పాశవికంగా, దుర్మార్గంగా రాష్ట్రప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించి, అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 24వ తేదీ చిత్తూరు జిల్లాలో జరిగే బంద్‌కు వ్యాపార, వాణిజ్య, వర్తకవర్గాల వారు, పాఠశాలలు, కళాశాలలు సినిమాహాల్స్, హోటల్స్ వారు సహకరించాలని వ్యవసాయకార్మిక సంఘం చిత్తూరు కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు చిరంజీవమ్మ, ఓబులరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ

- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 15,58,257
- ఓటర్లు వెబ్సైట్ ద్వారా వివరాలను పరిశీలించుకోవచ్చు : కలెక్టర్

ఓటరు తుది జాబితా విడుదల సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ఓటర్ల జాబితా సవరణ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో 2024 - తుది ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7,65,903 మంది పురుష ఓటర్లు, 7,88,725 మంది స్త్రీ ఓటర్లు, 84 మంది ట్రాన్స్ జెండర్లు, 3,379 మంది సర్వీస్ ఓటర్లు, 166 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, మొత్తం 15,58,257 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 18-19 సంవత్సరాల వయసు గల 33,495 మంది యువఓటర్లు నూతనంగా ఓటు హక్కు పొందారని తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ అని, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని, ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవచ్చునని తెలిపారు. ఓటర్ల జాబితాపై గల సందేహాల నివృత్తికి రాజకీయ పార్టీలతో సమావేశాలునిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరు నెలల పాటు రెవెన్యూ యంత్రాంగం పారదర్శకమైన ఓటర్ల జాబితాకు కసరత్తు చేసిందన్నారు. ఓటు నమోదుకు నామినేషన్‌కు పది రోజుల ముందు వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, తుది జాబితాలో ఓటు లేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రజలందరూ ఈవిషయాన్ని గుర్తు ఉంచుకోవాలని తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని తెలిపారు. తుది ఓటర్ల జాబితా బెంచ్ మార్కుగా భావించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా యంత్రాంగం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకురావాలన్నారు. గతంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాలలో ఇచ్చిన అభ్యంతరాలను పరిశీలించామన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లో అధికంగా ఓటర్లు నమోదు చేసుకున్నారన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ఓటర్ల పరిశీలన చేశారన్నారు. ఇంటింటి సర్వేలో వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని, చేర్పులు మార్పులను పకడ్బందీగా పరిశీలించామన్నారు. ఐదు కన్నా ఎక్కువ అభ్యంతరాలు వచ్చిన వాటిని ప్రత్యేక కమిటీతో పరిశీలన చేయించినట్లు తెలిపారు. మతి చెందిన ఓటర్లను సంబంధిత ఆధారాలతో తొలగించినట్లు తెలిపారు. ఇటీవల జారీ చేసిన డ్రాఫ్ట్ రోల్ పైనే మార్పులు చేర్పులు చేయడం జరిగిందన్నారు. తుది ఓటర్ల జాబితా కాపీలు అన్ని తహసిల్దార్ కార్యాలయాలకు, ఆయా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పంపడం జరుగుతుందన్నారు. సమావేశంలో డిఆర్ఓఎం రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎలక్షన్ సెల్ సూపరెండెంట్ బ్యూలా, బిజెపి అట్లూరి శ్రీనివాస్, టిడిపి దొరబాబు, సురేంద్ర కుమార్, వైసిపి ఉదయ్ కుమార్, కాంగ్రెస్ భాస్కర్, పరదేశి, ఆమ్ఆద్మీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నియోజకవర్గ ఓటర్లు 2,00,822

స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024లో భాగంగా చిత్తూరు నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ విడుదల చేశారు. చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ - 2024లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు అనంతరం తుది ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సోమవారం విడుదల చేశారు. చిత్తూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,00,822గా పేర్కొన్నారు. ఇందులో 97,765 పురుష ఓటర్లు, 1,03,023మంది మహిళా ఓటర్లు, 34 ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఈఆర్ఓ, ఏఈఆర్వోలు మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కు వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఏదైనా పొరపాట్లు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఏమైనా ఫిర్యాదులు ఉంటే మండల, నియోజకవర్గం, జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసుకోనే అవకాశం ఉందన్నారు.

చిత్తూరు నియోజకవర్గ ఓటరు తుది జాబితాను విడుదల చేస్తున్న ఆర్డీవో చిన్నయ్య

స్పందనకు 277 అర్జీలు

స్పందన కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 277 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 206, ఎండోమెంట్ శాఖ 1, జిల్లా విద్యాశాఖ1, పోలీసుశాఖ 5, వెనుక బడిన తరగతుల సంక్షేమం శాఖ 1, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్/ హెచ్ఆర్‌కె 1, సర్వే అండ్‌లాండ్ రికార్డ్స్ 2, జిల్లా పౌరసరఫరాల శాఖ23, యంపిడిఓ వెదురుకుప్పం 1, యంపిడిఓ పూతలపట్టు 1, ఎస్ఇఆర్ డబ్ల్యూఎస్ 3, ఏఇ ఇరిగేషన్ 1, అటవీశాఖ 1, నగర పాలకసంస్థ చిత్తూరు 1, పంచాయతీ రాజ్ 2, డిఎస్ఎల్ఓ 1, జిల్లా పారిశ్రామిక శాఖ 1, డిఆర్‌డిఏ 17, జిల్లా రిజిస్ట్రార్ 3, నేషనల్ హైవే 2, కో-ఆర్డినేట్ సూపరిటెండెంట్ 2, ల్యాండ్ సూపరిటెండెంట్ 1. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తమ వినతులను అందజేశారు.

నేడు 4వ విడత వైఎస్సార్ ఆసరా

జిల్లాలో 3,10,643మంది రూ.324 కోట్లు లబ్ధి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 23న అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి 4వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు ఆర్థిక సహాయంను నేరుగా వారి ఖాతాలకు జమ చేయనున్నారని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జి మహిళలను ఆర్థికంగా ఆదుకోవడంలో భాగంగా ఎన్నికల నాటికి ఎస్‌హెచ్‌జి మహిళలు వారి స్వయం సహాయక సంఘాలలో గల రుణాలను ముఖ్యమంత్రి 4 విడతలలో తిరిగి చెల్లించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలోని 33,655 ఎస్.హెచ్‌జిలకు చెందిన 3,10,643 మందికి రూ.324 కోట్లు లబ్ధి పొందనున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కార్యక్రమానికి వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి పాల్గొననున్న జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపిలు, జెడ్పీ చైర్మన్, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు, పాల్గొననున్నారని తెలిపారు.

జిల్లా పరిషత్ అంచనా ఆదాయం రూ. 4133.08 కోట్లు

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా పరిషత్‌కు రానున్న 2024-2025 సంవత్సరానికి సంబంధించి రూ.4133.08 కోట్లు ఆదాయం రానున్నదని ఖర్చులు రూ.3629.52కోట్లు అని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ 1, 7స్థాయి సంఘాల సమావేశం జిల్లా పరిషత్‌లోని చైర్మన్ ఛాంబర్‌లో వైస్‌చైర్మన్‌లు స్థాయి సంఘాల సభ్యులు, అధికారులతో నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను మౌలిక సదుపాయాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. రాష్ట్రప్రభుత్వం అనేక అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని చాలా కార్యక్రమాలు వివిధ శాఖల ద్వారా నిర్వహించడం, వాటికి సంబంధించి నిధులు జిల్లా పరిషత్ ద్వారా వెచ్చించడం జరుగుతోందన్నారు. ప్రధానంగా జిల్లాకు ముఖ్యమంత్రి ఇస్తానని చెప్పిన ప్రకారం పనులు మంజూరు చేశారని కుప్పంకు సంబంధించి హంద్రీ- నీవా ద్వారా నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే రామకుప్పం వరకు రావడం జరిగిందని ఆ విధంగా మాటను నిలబెట్టుకోవడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లాలో అందరికీ నీటిని ఇవ్వడానికి జలజీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. పలుసంక్షేమ కార్యక్రమాలు వివిధ శాఖల ద్వారా చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యతా భవనాల గురించి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను అడిగారు. ఈ సందర్భంగా పూర్తిఅయినా భవనాలు గురించి వివిధస్థాయిలలో జరుగుతున్న పనులను ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. గ్రామీణ నీటి సరఫరాకు సంబంధించి మంజూరైన పనులు ప్రగతి గురించి ఎస్ఈ విజయ కుమార్ వివరించారు. ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని ఆ నిర్మాణాలలో ముందు ప్రతిపాదించిన విధంగా సర్వీస్ రోడ్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. కుప్పం, పలమనేరు, వీకోటలలో ప్రభుత్వ అతిథి గహాలు పూర్తిస్థాయిలో పునర్నిర్మాణం చేయాల్సి ఉంటుందని, నూతనంగా మంజూరు అయిన బోయకొండ మల్లయ్య కొండ దుర్గం కొండ తదితర ప్రాంతాలలో అంచనాలను వెంటనే రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో జెడ్పీ వైస్ చైర్మన్ లు ధనంజయ రెడ్డి, రమ్య, ఐసిడిఎస్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, సభ్యులు సోమశేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రమీలమ్మ, సుకుమార్, ఏర్పేడు జడ్పిటిసి సభ్యులు, కలకడ జడ్పిటిసి హరిత, గంగవరం జడ్పిటిసి పార్వతిలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలకు పరిష్కార వేదిక 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి రిషాంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్‌పిని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్ ఎస్ఐబి అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరిత గతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 15 ఫిర్యాదులు అందాయి. భూతగాదాలు 9, ఆస్తి తగాదాలు 3, కుటుంబ తగాదాలు 2, వేధింపులు 1 ఫిర్యాదు అందాయి.

నేడు పాఠశాలలో మాక్‌పోల్ పై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 23న అన్ని పాఠశాలల్లో మాక్‌పోల్‌ను విధిగా నిర్వహించాలని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, ఎంపీడీఓలు ఎంఈఓలతో పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పన, ఓటర్ల దినోత్సవం నిర్వహణ, స్వీప్ యాక్టివిటిస్‌కు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23న ప్రతి పాఠశాలలో మాక్‌పోల్‌ను విధిగా నిర్వహించడం ద్వారా విద్యార్థులలో ఓటు హక్కును ఎలా వినియోగించుకుంటారనే అంశంపై అవగాహన ఏర్పడుతుందని, తద్వారా వారి తల్లిదండ్రులు ఓటు హక్కును వినియోగించుకునేలా పిల్లలు ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించేందుకు అవకాశం కలదన్నారు. పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పనపై ఈనెల 27వ తేదీ లోపు పూర్తి నివేదికను అందజేయాలని సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పనపై దష్టి పెట్టాలని తెలిపారు. దీనితోపాటు ఈ నెల 25న ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు ముమ్మరంగా స్వీప్ యాక్టివిటీస్ ను నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని, కళాశాలలు, వసతి గహాలు, స్వయం సహాయక మహిళలకు రంగోలి నిర్వహణ, విద్యార్థులకు పోటీలను నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, డిఆర్‌డిఎ పిడి తులసి, డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసి వెంకట రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ అరుణ, డిఎల్‌డిఓ రవికుమార్, ఐసిఓఎల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నోడల్ అధికారులు సమిష్టి కృషితో పనిచేయాలి

ఎన్నికల నిర్వహణపై అధికార్లతో సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రానున్న సాధారణ ఎన్నికలు- 2024 ప్రక్రియకు సంబంధించి నియామకం కాబడ్డ నోడల్ అధికారులకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకొని బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లాకలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో కలెక్టర్ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, ట్రైనింగ్ మేనేజ్మెంట్ మెటీరియల్ మేనేజ్మెంట్ ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్, సైబర్ సెక్యూరిటీ స్వీప్ యాక్టివిటీస్, ఈవీఎం మేనేజ్మెంట్, ఎంసిసి, ఎక్స్పెండిచర్ మానిటరింగ్, పోస్టల్ బ్యాలెట్, ఎంసిఎంసి, ఎలక్ట్రరోల్స్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే విధులకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తిబాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమిష్టి కషితో సమన్వయంతో పనిచేయడం ద్వారా సజావుగా ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మెగా మట్టి 'దోపిడీ'

- పరిమితికి మించి తవ్వకాలు
- రోడ్లు, వీధులు ధ్వంసం
- ప్రజలు, రైతుల్లో వ్యతిరేకత అయినా లెక్కచేయని వైనం
- అధికార యంత్రాంగానికి మూమూళ్లే మామూళ్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జాతీయ రహదారి పనుల విస్తరణ పేరిట ఆ పనులు చేపడుతున్న మెగా కంపెనీ మట్టి దోపిడీకి పాల్పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అనుమతులు లేకున్నా పరిమితికి మించి ఇబ్బడి ముబ్బడిగా మట్టి తవ్వకాలు చేస్తూ అటు పర్యావరణానికీ, ఇటు గ్రామీణులకు ముప్పు తెచ్చి పెడుతున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. అనుమతులు ఒకచోట.. తవ్వేది మరోచోట..! అనుమతులున్న చోట పరిమితులు దాటి అపరిమితంగా తవ్వకాలు చేస్తూ మెగా మట్టి దోపిడీకి తెగబడుతున్నారన్న ఆరోపణలు పెచ్చుమీరుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో మట్టి తవ్వే క్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా మెగా యాజమాన్యం లెక్కచేయడం లేదు. మెగా యాజమాన్యానికి స్థానిక అధికార పార్టీ నేతల అండతో పాటు ప్రభుత్వ యంత్రాంగం ఆశీస్సులు మెండుగా ఉండటంతో వారు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారుతోందన్న విమర్శలు ఉన్నాయి.

చెన్నయ్- బెంగుళూరు మధ్య దూరాన్ని, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు ఎన్‌హెచ్-71 జాతీయ రహదారి పురుడు పోసుకుంది. నాయుడుపేట వద్ద గల చెన్నయ్- కోల్‌కత్తా జాతీయ రహదారి-16 నుంచి ప్రారంభమై మదనపల్లి వరకు 170 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్-71 జాతీయ రహదారి సాగుతుంది. రహదారి అంచనా వ్యయం సుమారు రూ.5 వేల కోట్లుకాగా, మెగా సంస్థ దీని నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. రెండు దశల్లో పూర్తి కానున్న ఈ రోడ్డు నిర్మాణాన్ని 2022 నుంచి మెగా సంస్థ 2022 నుంచి పనుల్లో వేగం పెంచింది. మొదటిదశలో భాగంగా నాయుడుపేట- రేణిగుంట వరకు 57 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కానున్నాయి. రెండు లేన్ల రోడ్డుగా ఉన్న ఈ రహదారి 6లేన్ల రోడ్డుగా రూపుదిద్దుకుంటోంది. అయితే రోడ్డు నిర్మాణానికి అవసరమైన మట్టిని మెగా సంస్థ టెండరు ప్రక్రియ ద్వారా సొంతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఎక్కడా ఆ సంస్థ ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. స్థానిక అధికారపార్టీ నేతలు, సంబంధిత అధికారులతో కుమ్మక్కై తమకవసరమైన మట్టిని దోచేస్తున్నారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్న పరిస్థితి.

లైజనింగ్, హైవే మేనేజర్ల చేతివాటం

జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యత కల్గిన సబ్‌గ్రేడ్ గ్రావెల్‌ను మాత్రమే వాడాలన్న నిబంధన ఉంది. అది అందుబాటులో లేకుంటే రెండో రకం గ్రావెల్‌ను అయినా వాడాల్సి ఉంటుంది. అయితే కొందరు లైజనింగ్, హైవే మేనేజర్లు రోడ్డు నిర్మాణంలో సుద్ద, మట్టి కలిసిన నాణ్యతలేని మట్టిని రోడ్డు నిర్మాణానికి వాడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో గ్రావెల్‌కు బదులు మట్టి వాడితే భవిష్యత్తులో కుంగే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్న మాట. అంతేకాకుండా మెగా ఇంజనీరింగ్ సిబ్బంది రైతుల వద్ద మట్టి తవ్వేందుకు అనుమతులు తీసుకుని వారికివ్వాల్సిన కిరాయి కంటే తక్కువే చెల్లిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా ఒక రైతులకు క్యూబెక్ మీటరుకు రూ.70 చెల్లించాల్సి ఉంటే మెగా యాజమాన్యం కనీసం రూ.7కూడా చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు. ఆ కిరాయి కూడా సకాలంలో చెల్లించడం లేదనీ, మధ్యలో దళారులను నియమించుకుని ధగా చేసుస్తున్నారని మండిపుతున్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు వందల మంది రైతులకు బకాయి పడ్డారని సమచారం. ఒక వేళ చెల్లించినా అరకొరగానే బిల్లులు చెల్లించి చేతులుకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరంలో మట్టిని/గ్రావెల్‌ను తవ్వితే రైతుకు రూ.2లక్షల వరకు కిరాయి చెల్లించాల్సి ఉంటుంది. అయితే మెగా అధికారులు కేవలం రూ.20 నుంచి రూ.30 వేలే చెల్లిస్తుండటం గమనార్హం. ఇక చెరువులు, ప్రభుత్వ భూముల్లో అధికారపార్టీ నాయకులకు వాటాలిచ్చి నచ్చినంత తవ్వుకుని తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి.

రోడ్లు, వీధులు ధ్వంసం

జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిని తవ్వే క్రమంలో మెగా యాజమాన్యం జేసీబీలు,

ప్రొక్లేయిన్లు, భారీ టిప్పర్లను వినియోగిస్తుంది. పగలూ రాత్రీ తేడా లేకుండా చెరువులు, ప్రభుత్వ భూములు, రైతుల పొలాలనుంచి మట్టిని తరలించేందుకు ఆయా గ్రామాల రోడ్లను, వీధులను వినియోగిస్తుండటంతో ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడింది. శ్రీకాళహస్తి మండలం ఉడమల పాడు నుంచి ఊరందూరు రోడ్డులో నిరంతరం టిప్పర్లు మట్టిని తరలిస్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తొట్టంబేడు మండలం కాసరం పంచాయతీ కొండ్రాజుపల్లి చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. కల్లిపూడి-శ్రీకాళహస్తి రోడ్డులో నిరంతరం మెగా టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మెగా టిప్పరు ఢీ కొన్ని బసవయ్యపాళెం చెక్ పోస్టు వద్ద ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైతు పొలాల్లో రెండు మీటర్ల లోతులో మాత్రమే తవ్వకాలు జరగాలన్న నిబంధనను పక్కన పెట్టేశారు. చెరువుల్లో మీటరు మేర లోతులో తవ్వకాలు చేయాల్సి ఉంది. అది కూడా కట్టకు, తూములకు దూరంగా చేపట్టాల్సి ఉంటుంది. ఆ నిబంధనను కూడా మెగా యాజమాన్యం పెడ చెవిన పెడుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి నిర్మాణంలో మెగా సంస్థ చేస్తున్న మట్టి దోపిడీకి అడ్డుకట్ట వేసి నిబంధనల మేరకు నాణ్యతతోటి రహదారి నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యోగా గురువు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): యోగా గురువు పోస్టులకు ఆసక్తి కలిగి అనుభవం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు మంగళం ప్రాజెక్ట్ ఆయుష్ హోమియో వైద్యశాల వైద్యాధికారి ఎంఎస్ ప్రసన్న లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజులలో పురుషులు 32గంటలు, స్త్రీలు 20 గంటలు పని రోజులుగా నిర్ణయించామని, పురుషులకు రూ.8 వేలు, స్త్రీలకు రూ.5 వేల రూపాయలు వేతనం చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9908366751 నెంబరును సంప్రదించాలన్నారు.

టిడిపి అభ్యర్థి ఎవరో తెల్చుకోండి?: నేదురుమల్లి

ప్రజాశక్తి-వెంకటగిరి: టిడిపి అభ్యర్థి ఎవరో తేల్చుకోవాలని వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి టిడిపి నాయకులు సవాలు విసిరారు. తాను మాఫీ చేస్తున్నానని చంద్రబాబు వద్ద చెప్పించారని టిడిపి నాయకుడే తెల్లరాయి స్మగ్లింగ్ ఆధారాలతో నిరూపిస్తానని పేర్కొన్నారు. బిసి సాధికారత సభకు వచ్చిన జనం చంద్రబాబు సభకు రాలేదన్నారు. 7500 కుర్చీలు వేశారని అవి కూడా ఖాళీగా దర్శనమిచ్చాయన్నారు. ఆనంకు ఈప్రాంత ప్రజలు ఐదేళ్ళు ఎమ్మెల్యే అవకాశం ఇస్తే అభివృద్ధి చేయకుండా వాటి అడ్డుకున్న ఎమ్మెల్యేగా ఈప్రాంత ప్రజలందరికీ ఆయన వ్యవహారం తెలుసునన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు ఎల్ కోటేశ్వరరావు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బికే, వైయస్సార్ హెల్త్ క్లినిక్, మహిళా స్వయం సహాయక సంఘ భవనాలను వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దాదాపు కోటి రూపాయల నిధులతో ఒకే ప్రాంగణంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాలని లక్ష్యంతో నూతన భవనాలను నిర్మించారని, ప్రభుత్వ సంక్షేమ, పౌర సేవలను ప్రజల చెంతకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పట్టు ఎంపీటీసీ బి.యోగానంద రెడ్డి, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పకడ్బందీగా 'కుల గణన' సర్వే: తహశీల్దారు

ప్రజాశక్తి -కేవిబిపురం: కేవిబిపురం మండలంలోని గ్రామాలలో కుల గణన సర్వేను పకడ్బందీగా చేయాలని తహశీల్దారు శ్రీదేవి తెలిపారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీలలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓ లు కుల గణన పై సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల గణన సర్వేను సచివాలయాల సిబ్బంది వాలంటీర్లతో పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఈ కేవైసీ బయోమెట్రిక్ తప్పనిసరిగా చేయాలన్నారు. పది రోజుల లోపు సర్వేను పూర్తి చేయాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రయ్య పాల్గొన్నారు.

అన్నయ్యను గెలిపించండి..

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అభ్యర్థన

ప్రజాశక్తి - క్యాంపస్ : 'జగనన్న సంక్షేమ పాలన.. ఎమ్మెల్యే చెవిరెడ్డి ముందుచూపుతో చేసిన అభివృద్ధి పనులతో చంద్రగిరి నియోజకవర్గ రూపురేఖలు మారాయని.. చంద్రగిరి చరిత్రలో జగనన్న పాలన చిరస్మరణీయంగా నిలుస్తుంది..' అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చంద్రగిరి పంచాయతీ పరిధిలోని ఇందిరమ్ కాలనీ, బజారు వీధిలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందు రామ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆ తర్వాత గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల జాబితాలను అందించారు. చెవిరెడ్డి చేసిన మేలుకు రుణం తీర్చుకోవాలంటే ఆయన బిడ్డను ఎమ్మెల్యేగా చేయడం ఒక్కటే తమకున్న అవకాశం అంటూ పలువురు మహిళలు బహిరంగంగా స్పష్టం చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాతృత్వంతో గూడూరు పట్టణంలోని సంఘం థియేటర్ కూడలి వద్ద హీరాబెన్ మాతాజీ గ్లోబ్ ల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచల నాయుడు చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): తిరుచానూరు పరిధిలో సర్పంచి కీరకట్టు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మునీంద్ర రాయల్, చంద్రశేఖర్, యోగానంద, మురళి, ఎంపీటీసీలు కె నరేష్ రెడ్డి, శేఖర్, పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రమణ్యం రెడ్డి, ఉమాపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పట్టణంలోని స్థానిక. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ స్థాపించి ఇప్పటికీ 15 సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్‌గా కోనేటి రవిరాజు నియమిస్తూ, అసోసియేషన్ ప్రసిడెంట్ బొడ్డులూరు బాబు ని, జనరల్ సెక్రెటరీగా అస్థి రామ్మోహన్ వర్మని , ఇ లోకనాథ నాయుడు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున నడక గురించి అవగాహన మెడికల్ క్యాంప్స్ ,పేద విద్యార్థులకు బుక్స్ ఆట వస్తువులు ఉచిత పంపిణీ, చలివేంద్రాలు, పేదలకు దుస్తులు ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఈ నెల 25వ తేదీ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని, తిరుపతి నుండి ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్,హీరింగు ,డెంటల్, ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బ్లడ్ క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబునాయుడు, మురళి , లోకనాథ నాయుడు, ప్రసాద్‌రావు, కుప్పయ్య ,విజయ్ కుమార్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎంఎస్ డేటా సైన్స్'తో బంగారు భవిష్యత్తు : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విదేశాల్లో అందుబాటులో ఉన్న ఎంఎస్ డేటా సైన్స్ కోర్స్ ను ఉపకులపతి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కోర్సుకు బంగారు భవిష్యత్తు వుంటుందని విసి పేర్కొన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి రూపకల్పన చేసిన రకరకాల సాంకేతిక పరిజ్ఞానం గల కోర్సుల్లో భాగంగా ఎంఎస్ డేటా సైన్స్ కోర్సును నిర్వహించేందుకు అమెరికాలోని 'ఎక్సా ఫ్లూయెన్స్ ఇన్స్' సంస్థతో ఎస్వీయూ ఎమ్ఓయు చేసుకుంది. దీనిని అంతర్జాతీయ స్థాయి సిలబస్ తో , విదేశీ ఆచార్యులత బోధనలతో, విదేశీ కంపెనీలతో సర్టిఫికేషన్ చేయించే దిశగా కోర్సును ఉన్నత విద్యామండలి రూపకల్పన చేసింది.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

శ్రీకాళహస్తి, తొట్టంబేడు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా జయశంకర్, కార్యదర్శిగా సాయి రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా గురువారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దేవిశ్రీప్రసాద్, గౌరవ సలహాదారుగా సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శులుగా ఏ. సుబ్రహ్మణ్యం మబూబ్ ఖాన్, కోశాధికారిగా యుగంధర్ రెడ్డి, సంయుక్త కోశాధికారిగా గోపి, 14 మంది సభ్యులను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. లారీ ఓనర్స్ సమస్యలపై సంఘ టితంగా పోరాడుతామని నూతన అధ్యక్షుడు జయశంకర్ తెలిపారు.

ప్రతి పేద కుటుంబానికీ వైద్యం అందాలి

డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్

ప్రజాశక్తి-యాదమరి: ప్రతి పేద కుటుంబానికి సకాలంలో వైద్యం అందించే బాధ్యత మనందరిపై ఉందని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం యాదమరి మండలంలోని దిగువ బుట్ట కింద హరిజనవాడలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమానికి హాజరైన వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల చెంతకే వైద్యం తీసుకెళ్లాలని ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ 104 సర్వీసెస్ ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినెల మీ గ్రామానికి ఒక పర్యాయం వైద్య బృందం వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అనసూయమ్మ పాల్గొన్నారు.

విజయానందరెడ్డి విస్తృత పర్యటన

ఇంటింటి ప్రచారంలో విజయానందరెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సోమవారం చిత్తూర్‌రూరల్ మండలంలో విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజల నుండి విజయానందరెడ్డికి స్వాగతం ఘన స్వాగతం లభించింది. ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, తిరిగి అధికారంలోకొస్తే సీఎం జగన్ సర్కార్ చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం సాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్పలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

అంబులెన్స్ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం.కొత్తూరు సర్పంచ్ చంద్రమౌళి (రాజారెడ్డి) ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్‌ని సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ అంబులెన్స్‌ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా అంబులెన్స్ వాహనాన్ని పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి సోమవారం రామచంద్రం గ్రామంలో ప్రారంభించారు.

ద్రవిడ విశ్వవిద్యాలయంలో

యూజీ, పీజీ పరీక్షలు ప్రారంభం

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న రెక్టార్ అనురాధ

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రశాంతంగా యూజీ, పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.మధుజ్యోతి, రిజిస్ట్రార్ ఆచార్య ఏకె.వేణుగోపాల్ రెడ్డిలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. వర్సిటీలోని అన్ని విభాగాల్లో స్వయంగా వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, నిర్వహణలను గురించి పర్యవేక్షించారు. పరీక్షలు ముగిసిన వెంటనే వీలైనంత త్వరగా పరీక్ష ఫలితాలు వెలువడిస్తామని తెలిపారు. అదేవిధంగా ఈ పరీక్షలు ముగిసిన వెంటనే తదుపరి సెమిస్టర్ తరగతుల ప్రారంభం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ టి.అనురాధ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు మొత్తం 541 మంది యుజి విద్యార్థులు, ఫిబ్రవరి 2వ తేదీ వరకు మొత్తం 192 మంది పిజి విద్యార్థులు పరీక్షలకు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ అరవింద్ కుమార్, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్లు ప్రొఫెసర్ కె.శారద, ప్రొఫెసర్ లోకనాథ్ వల్లూరు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.నాగేశ్వర్ రావు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-యర్రావారిపాలెం:

మండలంలోని ఆదర్శ పాఠశాల నుండి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎనిమిదవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి సోమవారం తెలిపారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులు నేహాశ్రీ, దీక్షత మహాలక్ష్మి, సిద్విలాస్, అనూష, మిథున్, రెడ్డి ఉమేష్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో సహా ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. విద్యార్థులు మరెన్నో విజయాలు సాధించాలని తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమంలో పాల్గొని మండల స్థాయి నుండి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సోమవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడాసామగ్రిని ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో క్రీడాకారులకు అందజేశారు. ఎంపీపీ రెడ్డప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహించారన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి క్రీడా పోటీ లలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఈవోఆర్‌డీ శారదా దేవి, సర్పంచులు రమేష్ బాబు, నాయకులు అమర్నాథ్ రెడ్డి, లతీఫ్, కుమార్‌రెడ్డి, మునిరాజ పాల్గొన్నారు.

బీసీ సభను జయప్రదం చేయండి

మాజీ ఎంపీటీసీ మహేంద్ర

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బీసీ సభను జయప్రదం చేయాలని మాజీ ఎంపీటీసీ మహేంద్ర అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో బీసీలతో సమావేశం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 24వ తేదీ గాజులపల్లి రోడ్డులో బీసీ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి కోక ప్రకాష్‌నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్రనాయుడు, మాజీ సర్పంచులు నీరజాక్షులు గౌడ్, కోదండయాదవ్, నాయకులు నాగరాజుగౌడ్, వంశీచౌదరి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో వసతుల ఏర్పాట్లపై తనిఖీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పలు పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో వసతుల పరిస్థితిపై ఎంఈఓ శివరత్నమ్మ సోమవారం తనిఖీ నిర్వహించారు. ర్యాంపుల నిర్మాణం మరుగుదొడ్ల పరిశుభ్రత, తాగునీరు తదితర సౌకర్యాలపై పరిశీలించి వెంటనే తగిన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక ప్రాథమికోన్నత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించి రికార్డులను విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ నిర్వహించారు.

పోటీ పరీక్షల్లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పోటీ పరీక్షలో పెద్దపంజాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కేశవపిళ్లై సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు హాసిని, హఫ్సా ఫిరోస్, సోము, సంధ్యారాణి, వినయ్‌లు జాతీయ స్థాయిలో మెరిట్ స్కాలర్షిప్లు సాధించారని తెలిపారు.

జనానికి చేరువగా 'జనరిక్' మందులు

మంత్రి ఆర్కేరోజా

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి-నగరి: జనరిక్ మందులను జనానికి చేరువ చేస్తున్నామని మంత్రి ఆర్కేరోజా అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సహకార సంఘాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. ప్రస్తుత పాలనలో నగరి సహకార సంఘానికి రూ.42లక్షల వ్యయంతో నూతన భవనం, ఆర్థికంగా బలోపేతం చేయడానికి రూ.29లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామన్నారు. రైతులు వేడుకలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి రూ.67లక్షల వ్యయంతో ఫార్మర్ ఫంక్షన్ హాలు మంజూరు చేయగా నిర్మాణంలో ఉందన్నారు. రైతు గత ఏడాది ఇదే తేదీన సహకార సంఘం రూ.30లక్షల వయ్యంతో పెట్రోల్ బంకును ప్రారంభించి నిర్వహణ చేపట్టి లాభాల బాటలో నడుస్తోందన్నారు. ప్రస్తుతం జనరిక్ మందుల విక్రయాలను ప్రారంభించిందన్నారు. 1616మందులు ఈ షాపుల్లో 50 నుంచి 90శాతం వరకు తక్కువ ధరకు విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో డీసీవో బ్రహ్మానంద రెడ్డి, డీఎల్‌సీవో వనజ, నగరి పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, సీఈవో తులసిపిళ్లై, పీఏసీఎస్ డైరెక్టర్లు దామునాయుడు, నాగరత్నం, పేక్స్ డెవలప్‌మెంట్ సెల్ అధికారి శ్రీనివాసులు, పాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, కార్యదర్శి రమేష్, డీసీసీబీ సూపర్‌వైజర్లు ఆనంద్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

'మరుదు పాండ్యన్' సోదరులు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

విలేకరులతో మాట్లాడుతున్న బుల్లెట్ సురేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

స్థానిక చిత్తూరు – వేల్లూరు రోడ్, రిలయన్స్ మార్ట్ సూపర్‌స్టోర్ ఎదురుగా, గంగినేని చెరువు వద్ద, మరుదు పాండియార్స్ మెమోరియల్ పార్క్ ప్రధానపూజ, టిజి.బుల్లెట్ సురేష్ కిషితో విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో మామన్నన్ మరుదు పాండియార్స్ వారసులు రామస్వామి, నగర మేయర్ అముద, కమిషనర్ అరుణ, చుడా చైర్మన్ పురుషోత్తమరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, మొదలియార్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మొదలియార్, మొదలియార్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు గుణశేఖరన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మొదిలియర్ కార్పొరేషన్ చైర్మెన్ బుల్లెట్ సురేష్ మాట్లాడుతూ చిత్తూరులో స్వాతంత్ర సమరయోధులు మరుదు ప్యాండియన్ సోదరుల విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్వతంత్ర పోరాటంలో బ్రిటీష్ వాళ్ళను ఎదురించి ఊరితీయబడ్డ యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయడం నేటి యువతలో స్వాతంత్ర సూర్తిని నింపేలా ఉంటుందన్నారు.

అన్ని విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలి: టిటిడి జేఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో సోమవారం జేఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేఈవో మాట్లాడుతూ తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులను ఆహ్వానించేందుకు ఆహ్వాన పత్రికలు, ధార్మిక కార్యక్రమాలపై బుక్ లెట్ రూపొందించాలని డిపిపి అధికారు లను ఆదేశించారు. సదస్సుకు విచ్చేసే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనం, వసతి, రవాణా సదుపాయాలను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ నిర్వహించే ధర్మ ప్రచార కార్యక్రమాలపై వీడియో రూపొందించాలని ఎస్వీబీసి సిఈవోను ఆదేశించారు.

సంక్షిప్త వార్తలు

నేడు గుడిపల్లిలో లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుడిపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు టి.ఎం.బాబు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు వినాయక ఆలయంలో పూజలు అనంతరం కేక్ కట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ తరువాత అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యాదమరి: పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి రుక్మిణమ్మ ఆవిష్కరించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో హెచ్ఎం భాస్కర రావు, ఎ.పి.లలిత, గిరి రాజా, యూసఫ్ చేతులు మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కనకాచారి, శివప్రసాద్, సురేష్ రెడ్డి, ఆనందపిళ్ళై, హరికృష్ణ, భాస్కర రెడ్డి, హిమబిందు, మంజుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటాద్రి పురం బీసీ, ఎస్టీ కాలనీలలో రూ.13లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ లతబాలాజీ భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ మారు మూల గ్రా మాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టి రోడ్ల ఆధునీకరణే లక్ష్య ంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురగయ్య, సర్పంచ్ చిన్న, శేషాద్రి, జేజేలురెడ్డి, రమేష్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం.కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని రామసముద్రం గ్రామంలో నూతనంగా సీతా రామస్వామి దేవాలయం గుడి ధర్మకర్త గజేంద్ర ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపు వన్నెకుల క్షత్రియ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని గుత్తార్లపల్లి గ్రామంలో నిర్మించిన వన్నెకుల క్షత్రియ భవన ప్రారంభోత్సవం 24వ తేదీ ఉంటుందని కుప్పం మండల వైసిపి కన్వీనర్ హెచ్.యం.మురుగేష్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వన్నెకుల క్షత్రియ పేదల కొరకు నిర్మించిన ఈ భవనం పెళ్లిళ్ల అన్ని శుభకార్యాలకు భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి శరవణ, కుల నాయకులు బుల్లెట్ దండపాణి, వెంకటేశు, ఈశ్వర్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కట్టడాలు మావి - శిలా ఫలకాలు మీవా..?: టీడీపీ

ప్రజాశక్తి-కుప్పం: కట్టడాలు మావి శిలా ఫలకాలు మీవా అంటూ కుప్పం నియోజకవర్గంలోని టీడీపీ వన్నెకుల క్షత్రియ విభాగం మండిపడింది. సోమవారం గుడిపల్లి మండలం గుత్తార్లపల్లి గ్రామ పరిధిలోని వన్నెకుల క్షత్రియ కమ్యూనిటీ భవన ప్రాంగణంలో టీడీపీ వన్నెకుల విభాగం పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజలలో 65శాతం మంది ఉన్న వన్నెకుల క్షత్రియులను గుర్తించిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వన్నెకుల కులస్తుల సౌకర్యార్థం కమ్యూనిటీ భవన నిర్మాణానికి సుమారు ఎకరం స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులను మంజూరు చేశారన్నారు. అంతే కాకుండా టీడీపీ హయాంలోనే 90శాతం భవన నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. 2019లో అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయకుండా భవన నిర్మాణాన్ని అర్థాంతరంగా వదిలేసినట్లు ఆరోపించారు. అర్థాంతరంగా ఆగిన భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఈ విషయాన్ని ఇంతకాలం గుర్తించని అధికార ప్రభుత్వం తిరిగి ఎన్నికలు దగ్గర పడేసరికి నియోజకవర్గంలోని వన్నెకుల క్షత్రియులపై ఓట్ల ప్రేమ కురిపిస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే గత నాలుగు సంవత్సరాలుగా ఆగిన భవన నిర్మాణాన్ని ఇప్పుడు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జరిగిన పనులు సైతం నాసిరకం పనులేనని వాటిలో ఏ మాత్రం నాణ్యత లేదని ఆరోపించారు. ఇలా నాసిరకంగా పూర్తి అయిన భవనాన్ని ఈ నెల 24వ తేదీన ప్రారంభిస్తున్నట్లు అధికార పార్టీ ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ప్రారంభోత్సవానికి అధికార పార్టీ నాయకులు సిద్ధం చేసిన శిలాఫలకాలులో వన్నెకుల క్షత్రియ భవన నిర్మాణానికి స్థలాన్ని, నిధులను మంజూరు చేసిన అప్పటి ముఖ్యమంత్రి ప్రస్తుత కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే నారా చంద్రబాబునాయుడు పేరు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్లు లేకపోవడం ప్రభు త్వ ఉత్తర్వు లను వ్యతిరేకించడమే అన్నారు. ఈ చర్యల వల్ల స్థానికంగా శాంతి భద్రత లకు భంగం వాటిల్లే అవకా శం ఉందని, కావున పోలీ సు అధికా రులు వన్నెకుల క్ష త్రియ కమ్యూనిటీ భవన ప్రారంభ విషయంలో చోటు చేసుకున్న ప్రోటోకాల్ ఘటనను సరిచేసి, వివాదాలకు తావివ్వకుండా ప్రోటోకాల్ ప్రకారం శిలా ఫలకాన్ని ఏర్పాటు చేయడం తోపాటు ప్రోటోకాల్‌ను అనుసరించి అహ్వానాలను అందేలా చూడాలని కోరుతూ పోలీసుశాఖకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ వన్నెకుల క్షత్రియ విభాగం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

SRI R.K.M. LAW COLLEGE
(PERMANENT AFFILIATION FROM BAR COUNCIL OF INDIA, APSCHE & S.V. UNIVERSITY) R.V.S. NAGAR, CHITTOOR - 517 127

3/5 YEAR LL.B & 2 YEAR LL.M
MANAGEMENT QUOTA ADMISSIONS – 2023
Applications are invited for admission into 3/5 Year LL.B course and 2 Year LL.M course under Management Quota. Application are available in the office from 23.01.2024. Contact the College office on or before 31.01.2024.
Last Date for submission of application – 31.01.2024
Contact No. 7093686890 / 9959845526 / 9866451859

SRI R.K.M. LAW COLLEGE
(Permanent Affiliation from Bar Council of India, APSCHE & S.V. University) R.V.S. Nagar, Chittoor - 517 127
SPOT ADMISSION INTO LAW COURSES – 2023

S.No	Courses	Total Seats	Filled	Vacancies
1.	3 Years LL.B	270	47	223
2.	5 Years LL.B	108	04	104
3.	2 Years LL.M	36	21	15

The candidates are allotted to this college have been reported on 05.01.2024 their provisional allotment stands cancelled if they fail to report on 06.01.2024. For unfiled convener seats will be filled through Spot admissions from 23.01.2024 as per the guidelines issued by the convener LAWCET / PGLCET-2021 & APSCHE and Go. Ms.No.64/2006 (Lawcet) and Go.Ms.No.52/2007 (PGLCET). Last date for Spot Admissions 31.01.2024. 10% reservation of EWS quota Included.
Date: 23.01.2024
CORRESPONDENT

NAME CHANGE
I THURPU SAINATHA S/o T. Muni Reddy, R/o Door No. 34-164/6, Neelakunta Village, Palamaneru Post, Chittoor Dist.Andhra Pradesh, Pin No. 517408. I have changed my wife name from T. SUJATHA to THURPU SUJATHA.

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE : CHITTOOR
O.S.No. 331 of 2022
Canara Bank, Chittoor-II Branch, Rep., by its Senior Manager. ...Plaintiff
-versus
Sri Vasavi Mahila Sangam, Santhapet, Chittoor rep., by its President and others ..Defendants
Suit Summons to 3,4,7,9 and 11
1. **S.Selvi (Secretary)**, W/o Mani, D.No.5-881,D.B.Street,Santhapet,Chittoor.
2. **S.Priyanka,** W/o S.Sankar, D.No.5-1087/2, Aragonda Road, Santhapet, Chittoor.
3. **R.Ammulu,** W/o T.Rama Mohan, D.No.5-1031/2, Aragonda Road, Santhapet,Chittoor.
4. **K.Jayalakshmi**, W/o N.Krishna, D.No.5-1057, Indiranagar, Santhapet, Chittoor.
5. **T.Prabhavathi,** W/o C.Subramanyam, D.No.30-868,Mangasamudram,Chittoor.
Sir,
Please take notice that the plaintiff bank has filed the above suit against you and others for recovery of the amount. The said suit is posted to **25.01.2024** for your appearance. If you have got any objection you may appear on **25.01.2024 at 10.30 A.M**. either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.
Sd/- M.SUBRAMANYAM REDDY,
Advocate for Plaintiff
Place: Chittoor, Date : 19-01-2024

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE, CHITTOOR
G.O.P.No. 400 of 2023
Between:
1.M.Raghavan,S/o M.Rangan
2.R.Madhavi W/o R.Rangan
3.M.Gowramma,W/o P.Muniswamy
All are residing at D.No.3-13, Lakshmipuram VTC,Bairanganipalle Rural, Kuppam Post and Mandal, Chittoor Dist. **...Petitioners**
And:
NIL **... Respondents**
GENERAL NOTICE
Sir,
Please take notice that the petitioner have filed the above Guardian O.P. for appointment of 2nd Petitioner R.Madhavi as a guardian to the 1st petitioner M.Raghavan. The above case is posted to **30-01-02024** for general notice. If anybody have objections, please appear before the said Hon'ble Court on that day at 10-30 A.M either in personal or through an Advocate, otherwise the matter will be decided as per law.
Sd/- L.MUNASWAMY NAIDU
Advocate for the Petitioners
Place: Chittoor, Date 15-01-2024

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE, CHITTOOR
G.O.P.No. 401 of 2023
Between:
1.V.Varsha,D/o V.Vinod
2.G.Vidhya W/o V.Vinod
3.R.Gopal,S/o Late T.Ramappa
All are residing at D.No.3-13, Lakshmipuram VTC,Bairanganipalle Rural, Kuppam Post and Mandal, Chittoor Dist. **...Petitioners**
And:
NIL **... Respondents**
GENERAL NOTICE
Sir,
Please take notice that the petitioner have filed the above Guardian O.P. for appointment of 2nd Petitioner G.Vidhya as a guardian to the 1st petitioner V.Varsha. The above case is posted to **30-01-02024** for general notice. If anybody have objections, please appear before the said Hon'ble Court on that day at 10-30 A.M either in personal or through an Advocate, otherwise the matter will be decided as per law.
Sd/- L.MUNASWAMY NAIDU
Advocate for the Petitioners
Place: Chittoor, Date 15-01-2024